క్లుప్తంగా

ఘనంగా శాంతి కల్యాణం



అన్నదానం చేస్తున్న సేవాసమితి సభ్యులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీవేదాంత భజన మందిరంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి శాంతి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహర పుత్ర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ నిర్వాహకులు వాడకట్టు ఆంజనేయులు, బ్రాహ్మండ్లపల్లి దేవిదత్తు, బోనగిరి విజయ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుంగతుర్తి : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డానియేల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంకోటి, సైదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఆస్లాం తండాలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని సూర్యాపేట ఆర్డీఓ రాజేంద్రకుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఉన్న వసతులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్ప, ఆర్ఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


స్టేట్ బ్యాంక్ స్టాఫ్ యూనియన్ వేడుకలు



పీహెచ్‌సీకి ఫ్రిజ్ బహూకరిస్తున్న సిబ్బంది

భానుపురి (సూర్యాపేట) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి వై.తారకనాథ్ 19వ వర్ధంతిని పురస్కరించుకొని సూర్యాపేట స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో యూనియన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజనల్ మేనేజర్ కె.జ్యోతిలక్ష్మి హాజరై మాట్లాడారు. తారకనాథ్ యూనియన్ కోసం చేసిన పోరాటాలను, ఆశయాలను గుర్తు చేశారు. అనంతరం యూనియన్ డే సందర్భంగా సామాజిక సేవలో భాగంగా అంబేద్కర్ నగర్ పీహెచ్‌సీకి ఫ్రిజ్‌ను బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యారెడ్డి, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అయితగోని మహేష్, చీఫ్ మేనేజర్ కార్తీక్, చీఫ్ మేనేజర్ రమేష్, లోకల్ సెక్రెటరీస్ సురేష్, చందులాల్, హేమలత, నాగరాజు, సీహెచ్.నవీన్‌కుమార్, రామ్‌రెడ్డి, సతీష్, అకౌటెంట్ రవి, స్టాఫ్‌నర్స్ భాగ్యలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

మద్దిరాల : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో యోగా డేను నిర్వహించాలని అన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అచ్చయ్య గౌడ్, రమేష్, వెంకన్న ఉన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

చివ్వెంల(సూర్యాపేట) : గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న పలువురు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను మంగళవారం మండల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ధరావతు భిక్షంనాయక్, ధరావతు మంగ్తానాయక్, నాగేందర్‌నాయక్, చినానాయక్, రమేష్ నాయక్, రవినాయక్, హరినాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో పాఠశాలలు అభివృద్ధి



అర్వపల్లిలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెన్‌పహాడ్ : విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అనిత

సూర్యాపేట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని టేకుమట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం, మంచి రుచికరమైన ఆహారాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాగిజావ ప్యాకెట్లను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, వైస్‌ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే సంపూర్ణ వికాసం

మొక్కుబడిగా సాగే బోధనలతో కాకుండా విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే విద్యార్థికి సంపూర్ణ వికాసం లభిస్తుందని ఇమాంపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శంకర్‌నాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2022-2023 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని బాలెంల గ్రామంలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యాదినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్, దశాబ్ది ఉత్సవాల లోగోను బాలికలచే ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజ, సిబ్బంది శ్రావణి, మాధవి, ప్రియాంక, మౌనిక పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే విద్యారంగంలో ప్రగతి

అర్వపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతి సాధించినట్లు ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం పీఎస్‌లో విద్యార్థులకు రాగిజావ, పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్, పీఎస్‌లలో రాగిజావ, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను ఎస్‌ఎంసీ చైర్మన్‌లు లింగమూర్తిగౌడ్, రాంబాబు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన కొమారి శివాన్ని ఇటీవల వెలువడిన పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో 9.5జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ సన్మానించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాలీలు నిర్వహించి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ బాలునాయక్, హెచ్‌ఎంలు జెల్లా ప్రసాద్, ఎం.యాకలక్ష్మి, ఎస్‌ఓలు శిరీన్, నాగరాణి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ బాలునాయక్, హెచ్‌ఎంలు తబిత, సుధాకర్, చాంప్లానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని జెడ్పీటీసీ మామిడి అనిత అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన ఊరు-మనబడి పథకం కింద పాఠశాలకు మంజూరైన డిజిటల్ బోర్డ్స్, విద్యార్థులకు పోర్టిఫైడ్ రాగిజావా అల్పాహారంగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బొల్లక సౌజన్య, భూక్య నందినిని సన్మానించారు. విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంఈఓ నకిరేకంటి రవి, హెచ్‌ఎం మైలారపు వెంకన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ బొల్లక సొడయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన విద్యా దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసి ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఎర్రపహాడ్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పాటల పోటీల్లో విజేతలకు, గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, ఎంఈఓ రాములు నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూర్-ఎస్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. అదే విధంగా పలు పాఠశాలల్లో క్రీడలు, క్విజ్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి సన్మానించారు. మండల కేంద్రంలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలలో పదోతరగతిలో 9.5జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ధారాసింగ్, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ వీరారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలో మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జాతీయ జెండాలు ఆవిష్కరించారు. మండలంలోని తొండ, అనంతారం పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, ఎంపీడీఓ ఉమేష్‌చారి, సర్పంచ్ ఎన్.శాతవాహన రావు, అశోక్‌రెడ్డి, మురళి, మల్లిఖార్జున్‌గౌడ్, అనితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ప్రభుత్వం పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో నిర్వహించిన విద్యా దినోత్సవంలో ఆమె పాల్గొని విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పాఠశాలలో డిజిటల్ తరగతులను, లైబ్రరీ కార్నర్‌ను ప్రారంభించి, విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకన్న, పీఎస్ హెచ్‌ఎం వి.మల్లయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు చిప్పలపల్లి మల్లేష్, నవనీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు రాగిజావ, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగయ్య, నాయకులు రాములుగౌడ్, రమేష్, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా పాఠశాలలో మంగళవారం విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ ధరావత్ కుమారి బాబునాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన విద్యాదినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, మండల విద్యాధికారి గోపాల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్ రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మిర్యాల పార్వతమ్మ, హెచ్‌ఎం కళారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి (తుంగతుర్తి) : తొండ పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ స్నేహలత



సూర్యాపేట రూరల్ : ఉపాధ్యాయులకు రాగిజావ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



నాగారం : జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీపీ మణి



సూర్యాపేట రూరల్ : దశాబ్ది ఉత్సవాల లోగో ఆకృతిలో కూర్చున విద్యార్థినులు



జాజిరెడ్డిగూడెం పీఎస్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ వీరప్రసాద్



మద్దిరాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నూతనకల్ : విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



చివ్వెంల : పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి బాబునాయక్

ఆధ్యాత్మిక దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏర్పాట్ల పరిశీలకుడు జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 9మండలాల అర్చకులు ఈ ఉత్సవానికి హాజరు కానున్నారని అన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అర్చకులతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. అలాగే అర్చకులు, వేదపండితులను ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ సన్మానించనున్నట్లు, కాగా అందరికి భోజన వసతి కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

వర్షం కోసం కాముని ఆట



కాముని ఆట ఆడుతున్న మహిళలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : జూన్ 3వ వారం దాటినా వర్షాలు కురవకపోవడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండలంలోని వెలిశాల గ్రామంలోని ఓ చెరువులో గ్రామానికి చెందిన పలువురు మహిళలు వర్షాలు కురవాలని కాముని ఆట ఆడారు.

రోడ్లపైకి గేదెలను వదిలితే కేసులు నమోదు

అర్వపల్లి : గేదెలను రోడ్లపైకి వదిలి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని అర్వపల్లి ఎస్ఐ బి.అంజిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ గేదెల కొమ్ములకు రేడియం పెయింట్ వేయించాలని సూచించారు. పశువులను రైతులు రోడ్లపైకి వదలకుండా గ్రామాల్లో సర్పంచ్‌లు డప్పు చాటింపు వేయించాలని కోరారు.

ఆలయానికి గ్రిల్స్ ఏర్పాటు

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలోని కొండవీఎద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి లయన్స్ క్లబ్ సహకారంతో రూ.12వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రం గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో దాత లక్ష్మణ్, కార్యదర్శి ఐతె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, గుండా భాస్కర్, కృష్ణమాచారి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కుల వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయాన్ని రూ.10లక్షలకు పెంచాలని, అదేవిధంగా దరఖాస్తు గడువు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎస్తేరుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాసాని శ్యామ్‌యాదవ్, తాళ్లపల్లి లింగయ్య గౌడ్ ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : బీసీ కులాల్లో చేతి వృత్తుల వారికి రూ. లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తుకు మంగళవారం చివరి రోజు కావడంతో తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాలకు దరఖాస్తుదారులతో రద్దీగా మారాయి. సర్వర్ డౌన్ కావడంతో సర్టిఫికెట్లు ఆలస్యం అవుతుండటంతో లబ్ధిదారులు ఆందోళనకు లోనవుతున్నారు. దరఖాస్తు గడువు పెంచాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : నియోజకవర్గ ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న తిరుమలగిరిలో జరిగే సభకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలగిరి మున్సిపాలిటీకి మంజూరైన రూ.50 కోట్ల అభివృద్ధి నిధులతో మున్సిపల్ నూతన భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన, అమృత్ పథకం కింద మంజూరైన నిధులతో పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జన సమీకరణకు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, మామిడి సర్వయ్య, శోభన్‌బాబు, దూపటి రవీందర్, బత్తుల శ్రీను, ప్రియలతా రాముగౌడ్, కందుకూరి లక్ష్మయ్య, డానియల్, సందీప్ నేత, రాములు, కొండయ్య, గణేష్, బాబు, చారి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. నియోజకవర్గం 9సంవత్సరాలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. గోదావరి జలాలతో నియోజకవర్గం సస్యశ్యామలం అయిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, సర్పంచ్ ఆకుల వీరయ్య, దూపటి రవీందర్, కోఆప్షన్ సభ్యుడు ఆజాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- మంత్రి జగదీశ్‌రెడ్డి



గ్రంథాలయంలో షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్

భానుపురి (సూర్యాపేట) : గ్రంథాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయిస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయం ఆవరణలో మహిళా అభ్యర్థులు చదువుకోవడానికి నిర్మాణం చేసిన అదనపు షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు మంచి పుస్తకాలతో పాటు, రుచికరమైన భోజనం వసతి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయంలో ప్రతిరోజూ 200 మంది యువకులు, 120మంది యువతులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు, కౌన్సిలర్‌లు తాహేర్ పాషా, నిమ్మల స్రవంతి, కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, రియాజుద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ఉప్పల ఆనంద్, కక్కిరేణి నాగయ్య, కుంభం రాజేందర్, శబరినాథ్, సయ్యద్ సలీం, జలీల్, ఇరుగు కోటేశ్వరి, కరుణశ్రీ, కల్లెపల్లి మహేశ్వరి, గ్రంథాలయ కార్యదర్శి కేవీ సీతారామశాస్త్రి, లైబ్రేరియన్లు శ్యామ్‌సుందర్ రెడ్డి, ఎంవీ రంగారావు, కె.విజయభాస్కర్, పి.సృజన తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకులు సాధించడం గర్వకారణం

భానుపురి (సూర్యాపేట) : అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న సూర్యాపేట విద్యారంగంలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణమని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో ఇటీవల జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓబీసీ కేటగిరిలో 396వ ర్యాంకు సాధించిన దేశగాని చెన్నకేశవ గౌడ్‌ను ఆయన సన్మానించి అభినందించారు.

సభను విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : మాదిగల ఆత్మగౌరవ మహాజాతర సభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకుడు యాదాకుల రాజన్న మాదిగ అన్నారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డు చింతలచెరువులో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జూలై మూడో వారంలో హైదరాబాద్‌లో లక్ష మందితో మాదిగ ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర వీరస్వామి, పుట్టల మల్లేష్, మేడి కృష్ణ, వెంకన్న, ఏర్పుల నవీన్, సుధాకర్, చిన్ని, లక్ష్మక్క, స్వరాజ్యం, కవిత, రాములమ్మ పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

నాగారం : ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చిన వేరుశనగ విత్తనాలను రైతులకు సమాచారం ఇవ్వకుండా తమ ఇష్టానుసారంగా విక్రయిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతులు మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వేరుశనగ విత్తనాల కోసం కార్యాలయానికి వచ్చిన రైతుల పట్ల వ్యవసాయ శాఖ అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ఏఓ గణేష్‌ను వివరణ కోరగా.. విత్తనాలను పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతులకు పారదర్శంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు బయ్యం వెంకన్న, లింగయ్య, కన్నెబోయిన అవిలయ్య, వీరయ్య, రమేష్, లక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దాడులను నిరసిస్తూ రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

నూతనకల్ : త్రిపుర రాష్ట్రంలో ప్రజాతంత్ర వాదులపై బీజేపీ నాయకులు చేస్తున్న దాడులను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టిన తరువాత దేశంలో మతం ముసుగులో ప్రజాతంత్ర వాదులపై నిరంతరం దాడులు చేయిస్తున్నారని, దాడులను బీజేపీ నాయకులు మానుకోకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కూసు సైదులు, బత్తుల జనార్దన్, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, బాలగాని సోమయ్య, లింగయ్య, దామోదర్‌రెడ్డి, లింగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

నాగారం : వానాకాలం పంటల సాగుకు ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు నార్లు పోసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట వెంకటేశ్వర్లు, వెంకన్న, రాములు ఉన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని తిరుమలగిరి చెందిన పాలబిందేల ఉమా, గోరంట్ల గ్రామానికి చెందిన ఉప్పుల గణేష్‌ల ఆదర్శ వివాహాన్ని సూర్యాపేట పట్టణంలోని న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమా, గణేష్ ఒకరినొకరు అర్థం చేసుకొని తమ దాంపత్య జీవితాన్ని ఆదర్శప్రాయంగా కొనసాగించాలని సూచించారు. సమాజంలో అనేక రకాల ప్రభావాలతో కుటుంబాలలో సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని వీరు అర్థం చేసుకొని ముందుకు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మయ్య, బొడ్డు శంకర్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలబోయిన కిరణ్‌కుమార్, సామ నర్సిరెడ్డి, వీరబోయిన రమేష్ పాల్గొన్నారు.